క్లుప్తంగా

ఊదర కాలువ నీటిని బయటకు పంపాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఊదర కాలువ నీటిని బయటకు పంపి రైతులను ఆదుకోవాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మికి విజ్ఞాపన పత్రాన్ని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు సోమవారం అందజేశారు. స్పందించిన ఆమె పంచాయతీ ఏఈ శ్రీనివాస్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం గ్రామ అధ్యక్షులు బండ్లమూడి కనకాంబరం, కర్రే దావీదు, కాలువ వెంకటేశ్వరరావు, మక్కెన కోటేశ్వరరావు, లక్కు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి రెడ్ల బజారులో తాళాలు వేసిన ఇంటి తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడిన సంఘటనపై సోమవారం బాధితులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు శాంతి తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా మైలవరం మండలం వెల్లడంలోని తన బంధువుల ఇంటికి మూడు రోజుల కిందట వెళ్లారు. ఇంటి పక్కన వారు ఉదయం ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయని చెప్పడంతో హుటాహుటీన ఇంటికి చేరుకున్నారు. బీరువా తాళాలు పగలకొట్టి బంగారపు వస్తువులు, వెండి కుంకుమ భరిణ, వెండి గిన్నె, మరికొన్ని వెండి సామాన్లు దొంగిలించారు. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ గుంటూరు నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి వేలి ముద్రలు సేకరించామని, త్వరలోనే చోరీకి పాల్పడిన వారిని పట్టుకుంటామని తెలిపారు.

నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలి


తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేక చెరువుల్ని తలపిస్తున్నాయని, నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరికి సీపీఎం మండల నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే రెండుసార్లు వరి విత్తనాలు వెద పెట్టారని, పల్లంలో ఉన్న పంట పొలాలు ముంపునకు గురై నష్టం వాటిల్లిందని, అధికారులు చొరవ చూపించి నీటిని బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, బి. అమ్మిరెడ్డి, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని సోమవారం పంపిణీ చేశారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎండీ ఇజాజ్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ ప్రతినెలా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు మందులతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుగ్గిరాల వైద్య సిబ్బంది విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



ఫిరంగిపురం: కారు, ఆటో ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రేపూడి గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేమవరం నుంచి ఫిరంగిపురం వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ ఆర్.గజేంద్రవర్మకు తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం అతడిని 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్కింగ్ అడ్డగోలు



పాత బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు



ఆటోనగర్ సమీపంలో ఓ హోటల్ వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మామూళ్ల మత్తులో పోలీసులు

మంగళగిరి: నగరంలోని గౌతమబుద్ధా రోడ్డుతోపాటు పలు రోడ్లు విస్తరించినా ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవతో నగర ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డును రూ.23.50 కోట్లతో విస్తరించారు. సుమారు 150 అడుగులు మేర రోడ్డు విస్తరించినా కొందరి మూలంగా నగర వాసులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. హోటళ్ల వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్ల మధ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. సాయంత్రం వేళ ట్రాఫిక్ రద్దీ పెరుగుతుంది. ఆటోనగర్‌లోని హలో ఇడ్లీ సెంటర్‌లో ప్రతి రోజూ సాయంత్రం రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ పెరగడంతోపాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసులు కూడా పట్టించుకోవడం లేదు. లాడ్జిలు, హోటళ్లు, టిఫిన్ బండ్లు వద్ద నెలకు రూ.5వేల నుంచి రూ.10వేల చొప్పున వసూలు చేస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. ఈ విషయమై పట్టణ సీఐ బి అంకమ్మరావును వివరణ కోరగా ట్రాఫిక్ ఇబ్బందులకు గురిచేసే విధంగా వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. సిబ్బంది ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించబోమని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పక్కాగా ఓటర్ల జాబితా సర్వే

అడిషనల్ కమిషనర్ హేమమాలిని



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఇంటింటా ఓటర్ల సర్వేను అడిషనల్ కమిషనర్ హేమమాలిని సోమవారం పరిశీలించారు. పలువురు ఓటర్లతో మాట్లాడి బీఎల్‌ఓలు చేపడుతున్న సర్వే తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాల ఆధారంగా బూత్‌లెవల్ అధికారులు, పార్టీల నాయకులు సమన్వయంతో సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల్లో అక్రమాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు పత్రాలు అందించి ఓటరుగా నమోదు అయ్యేలా బీఎల్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి వివరాలు ఉన్నాయో లేదో సరి చూసుకుని తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. జాబితాలో క్లెయిమ్స్, అభ్యంతరాల కింద ఫారం 6,7 ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

మొబైల్ వ్యాన్ల వద్దనే రేషన్ పంపిణీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ వారికి, రేషన్ డీలర్లతో తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1వ తేదీ జరగబోయే రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలని, ఎవరైనా అవకతవకలకు పాల్పడినా, క్రమశిక్షణ ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రేషన్ మొబైల్ వ్యాన్‌ల వద్ద మాత్రమే రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు దుర్గారావు, సతీష్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మేడికొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని మండల విద్యుత్‌శాఖ అధికారి జి.నాగరాజుకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేడికొండూరు, గుండ్లపాలెం, విశదల, భీమినేనివారిపాలెం, పొట్లపాడు, సిరిపురం, జంగంగుంట్లపాలెం, పాలడుగు, యలవర్తిపాడు, సరిపూడి, మందపాడు గ్రామాల్లో విద్యుత్ లేన్ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలి

తాడేపల్లిరూరల్: కడప ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలని, రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం ప్రాతూరు వద్ద జాతీయ రహదారిపై సీపీఎం తాడేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమని అన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. విశాఖ ఉక్కు, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారాలకు నిధులు కేటాయించకుండా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని విమర్శించారు. కడప ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు అమ్మిశెట్టి రంగారావు, పల్లె కృష్ణ, దోకిపర్తి రాజేంద్రబాబు, పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు, అమ్మిశెట్టి రామారావు, ఎస్‌కె గస్, ఎస్.రవికిషోర్, నల్లపు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, విజయవాడ అమరావతి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని రోటరీ పిడిజి అన్నే రత్న ప్రభాకర్, చైర్ ఉమెన్ ఆంధ్రా రీజియన్, మ్యాటర్నల్ చైల్డ్ హెల్త్ పి.విజయలక్ష్మి ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షులు పరుచూరి కిరణ్, కార్యదర్శి చంద్ర ఓబులారెడ్డిలు మాట్లాడుతూ మనిషి శరీరంలో అన్ని అవయవాల కంటే కళ్లు అత్యంత ప్రధానమైనవని, చిన్నారులు ప్రతి ఒక్కరూ కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవాలని సూచించారు. సుమారు 60 మంది చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశామని, ప్రసవించే మహిళ ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో 40 మంది గర్భిణులకు ఉచితంగా న్యూట్రిషన్ ఫుడ్ సప్లిమెంట్స్‌ను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి ఎంఈఓలు నాగేశ్వరరావు, శాంతకుమారి, రోటరీ సభ్యులు శెట్టి కేశవరావు, శెట్టి రామకృష్ణ, సుకుమార్‌రెడ్డి, గోపాలం సాంబశివరావు, కాట్రగడ్డ శివన్నారాయణ, జొన్న రాజేష్, లింగంశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ విన్యాసాలు చేసిన యువకులు అరెస్టు

తాడికొండ: తుళ్లూరు మండలం దొండపాడు–తుళ్లూరు గ్రామాల మధ్య ఉన్న సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఆదివారం బహిరంగ ప్రదేశాలలో బైక్‌లను అతివేగంగా, అతి జాగ్రత్తగా నడిపిన యువకులను అరెస్టు చేసినట్లు తుళ్లూరు డీఎస్పీ వి పోతురాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇతర వాహన చోదకులకు ఆటంకం కలిగిస్తూ బైక్‌లతో విన్యాసాలు చేయడం నేరం కావున వారి బైక్‌లను సీజ్‌చేసి అరెస్టు చేశామని, మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, సెలవు దినాల్లో బైక్‌లు తీసుకొని బయటకు వెళ్లే సమయంలో వారికి తగిన సలహాలు, జాగ్రత్తలు తెలియజేయడంతోపాటు నిఘా ఉంచుకోవాలని సూచించారు.

వేస్ట్ పిక్కర్లపై అధ్యయనం అభినందనీయం



అధ్యయన నివేదికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: గుర్తింపులేని వృత్తులు చేస్తున్న వారి ఆరోగ్యం, పౌష్టికాహార సమస్యలపై అధ్యయనం చేయడం శుభపరిణామని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.గోపాలరావు తెలియజేశారు. సోమవారం అమరావతిరోడ్డులోని దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) కార్యాలయంలో అధ్యయన నివేదికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి గుర్తింపునకు నోచుకోక దుర్భర జీవితాలను గడుపుతున్న వేస్ట్ పిక్కర్ల కుటుంబాలకు చెందిన మహిళలు, పిల్లలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, పోషకాహార సమస్యలపై చేసిన అధ్యయనం వారి జీవితంలో కనీస మార్పునకు దోహదపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి పనబాక కృష్ణయ్య, డాక్టర్ చిక్కాల నాగరాజు, డాక్టర్ వై.శ్రీనివాసులు, డీబీఆర్‌సీ కార్యదర్శి అల్లడి దేవకుమార్, ప్రోగ్రాం మేనేజర్ చుక్కా శామ్యూల్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలోనే స్థలాలు కేటాయించాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో తాము నివాసముంటున్న గ్రామంలోనే జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ చిలువూరు మాదిగపల్లెలోని కమ్యూనిటీ హాల్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1902 నెంబరుకు పేదలు ఫోన్ చేసి అభ్యర్థించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ చిలువూరులో నివాసముంటున్న తమకు 5 కిలోమీటర్ల దూరంలో వున్న కంఠంరాజు కొండూరు గ్రామ శివారులో స్థలాలు మంజూరు చేశారని, అక్కడకు వెళితే కూలి పనులు చేసుకునే జీవించే తమకు జీవనోపాధి కోల్పోతామని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకంతో 1902కు ఫోన్ చేసి తమకు చిలువూరులోనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అభ్యర్థన చేశామని తెలిపారు.

తండ్రి మందలించాడని ఇంటి నుంచి పరారీ



మెండు హేమంత్ (ఫైల్)

మంగళగిరి: సినిమాకు వెళ్లి స్నేహితుడి ఇంటికి వెళ్లానంటూ అబద్ధం చెప్పాడని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నగరంలోని పాత మంగళగిరి వరహాలపేటకు చెందిన హైకోర్టు అడ్వకేట్ గుమస్తా మెండు శేషసాయిబాబు కుమారుడు హేమంత్ (13) నగరంలోని ఎస్ఎస్ టాలెంట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజులు స్కూలు సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 29వ తేదీన సాయంత్రం ఆరుగంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి అదే రోజు రాత్రి 10 గంటలకు తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చిన కుమారుడిని ఎక్కడికి వెళ్లావని తండ్రి ప్రశ్నించడంతో స్నేహితుడి ఇంటికి వెళ్లి వచ్చానని నమ్మబలికాడు. సినిమాకు వెళ్లి స్నేహితుడి ఇంటికి వెళ్లి వచ్చానని అబద్ధం చెబుతావా? అంటూ తండ్రి శేషసాయిబాబు మందలించాడు. మనస్తాపం చెందిన హేమంత్ సోమవారం ఉదయం తండ్రి డ్యూటీకి వెళ్లిన కొద్దిసేపటికి స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని తల్లిని నమ్మించి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన శేషసాయిబాబుకు విషయం తెలిసి ఇరుగుపొరుగు వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. తన కుమారుడు హేమంత్ అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఐ కిషోర్ బాధ్యతల స్వీకారం



ఫిరంగిపురం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా చల్లా కిషోర్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ఇంటిలిజెన్స్ ఎస్‌ఐగా పని చేస్తూ బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఎస్‌ఐగా పని చేసిన ఎం.లక్ష్మీనారాయణ రెడ్డిని వీఆర్‌కు పంపారు. కిషోర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

పనులకు ఆటంకంగా ఉన్న ఫెన్సింగ్ తొలగింపు



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం మార్కెట్ యార్డు రోడ్డు వెంబడి నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ నిర్మాణానికి అవరోధంగా మారిన ఐరన్ ఫెన్సింగ్, కంప చెట్లను సోమవారం పొక్లెయిన్‌తో తొలగించారు. సుమారు రూ.1.70 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు భారీ వర్షాల అనంతరం తిరిగి రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీసీ డ్రెయిన్ స్థలంలో ఆక్రమణదారులు కొన్నేళ్ల కిందట వేసిన ఐరన్ ఫెన్సింగ్‌తో పాటు కంప చెట్లు పెరిగి అవరోధంగా మారడంతో పొక్లెయిన్‌తో తొలగించి శుభ్రం చేశారు. ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పనులు పూర్తి చేసే విధంగా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

శాంతిభద్రతలు కాపాడటంలో బీజేపీ విఫలం

మంగళగిరి: మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడటంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం రవి అన్నారు. బీజేపీ పాలిత మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులపై జరుగుతున్న నరమేధాన్ని నిరసిస్తూ కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో సీఐటీయూ, రైతు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రవి మాట్లాడుతూ మైనార్టీలుగా ఉన్న గిరిజనులపై మారణహోమం సాగిస్తూ రావణకాష్టంగా మారుస్తుంటే ప్రధాని మోదీకి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. మణిపూర్‌లో మత విద్వేషాలను రెచ్చగొట్టి రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చడం బీజేపీ వికృత రాజకీయ క్రీడకు పరాకాష్ట అన్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం దేశంలో మత కల్లోలాలు సృష్టించి అన్నదమ్ముల వలె ఉంటున్న ప్రజల మధ్య చీలికలు తీసుకువచ్చి తమ పబ్బం గడుపుకునేందుకు కుట్రలు సాగిస్తున్న బీజేపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాజధాని డివిజన్ నాయకులు అత్తలూరి వీరవెంకయ్య, సీఐటీయూ నాయకులు బాబు, ఆదిలక్ష్మి, రామారావు, మహిళా సంఘం నాయకులు పార్వతి, మేరి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల నిర్వాహకులపై కేసు

తాడికొండ: కోడిపందేల నిర్వాహకులు అబ్బూరు లీలాప్రసాద్, కొంత మందిపై కోడిపందెం నిర్వహించినందుకు నన్నెబోయిన బాజిపై దాడిచేసినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు. కోడిపందేల నిర్వహణలో వచ్చిన వివాదంలో బాధితుడిపై దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇనుము చోరీ చేస్తున్న వ్యక్తులు అరెస్టు

తుళ్లూరు మండలం ఐనవోలు పొదల్లో ఉన్న పాత ఇనుమును చోరీ చేస్తున్న నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ ఆనందరావు తెలిపారు. ఐనవోలు పొదల్లో ఉన్న పాత ఇనుమును బొజ్జగాని రేణుక, మరికొంత మంది ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్ అరివేణి నాగరాజుతోపాటు, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

మణిపూర్‌లో శాంతిని కాంక్షిస్తూ ర్యాలీ



మాట్లాడుతున్న ఫాదర్ మద్దు బాలస్వామి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దైవ సేవకులు

ఫిరంగిపురం: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు హేయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ వ్యవహారాల సలహాదారుడు, మార్నింగ్ స్టార్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామి అన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. బేతేలు చర్చి నుంచి సంఘ సభ్యులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ పద్మనాభుడికి వినతిపత్రం అందజేశారు. ఫాదర్ ఎం.బాలస్వామి మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులు హేయమని అన్నారు. క్రిస్టియన్ మిషినరీలు దేశంలోని ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు ఎంతో శ్రమించాయని తెలిపారు. అక్కడి రాష్ట్రంలోని క్రైస్తవులు ఎన్నో కష్టాలకు గురవుతున్నారని చెప్పారు. ప్రపంచ ప్రజలు దీనిని గమనిస్తున్నారని తెలిపారు. క్రైస్తవులు అందరూ మేలుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్లు రత్నబాబు, ఆనందబాబు, ఎస్.మోహన్‌రావు, డి.ప్రసాదరావు, ఎస్కే, మదార్, సాల్మన్, పురుషోత్తమ్‌లు పాల్గొన్నారు.

మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ ర్యాలీ

మంగళగిరి: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న మారణహోమాన్ని నిరసిస్తూ నగరంలోని లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి శాంతి ర్యాలీ నిర్వహించారు. చర్చి వద్ద నుంచి ప్రారంభమైన ఈ శాంతి ర్యాలీలో క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ పురవీధుల గుండా సాగించి అనంతరం చర్చి వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో బిషప్ ఎస్‌జే బాబూరావు, రెవరెండ్ వరప్రసాద్, రెవరెండ్ నవీన్‌బాబు, సంఘ పెద్దలు కారుమంచి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశు కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్, పక్కన వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్స్ వార్డులో నవజాత శిశువు చికిత్స కేంద్ర నిర్మాణం కోసం సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయితే 20 పడకల నుంచి 40 పడకలు వరకు పెరుగుతాయని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, పిల్లల వైద్య విభాగం వైద్యులు మోహన చంద్ర, రమేష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ అసిస్టెంట్ ఇంజినీర్ కుంచె వెంకట రత్తయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా 182వ గాస్పెల్ డే వేడుకలు



కొవ్వొత్తులతో సంఘీభావం తెలుపుతున్న పాస్టర్లు, సంఘస్తులు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని నార్త్‌ప్యారిష్ చర్చిలో ఆంధ్ర సువార్తిక లూథరన్ సంఘం (ఏఈఎల్‌సీ) 182వ ఆవిర్భావ (సువార్త) దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్, క్రైస్తవ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఫాదర్ ఎం.బాలస్వామి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్, మైనార్టీ సెల్ చైర్మన్ ఎం.జాన్సన్, విశ్రాంత ప్రొఫెసర్ రెవరెండ్ డాక్టర్ వి.మాణిక్యరావు పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏఈఎల్‌సీ మోడరేటర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ కె.ఎఫ్.పరదేశిబాబు మాట్లాడుతూ ఏఈఎల్‌సీ వ్యవస్థాపకుడు రెవరెండ్ జాన్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ హెయ్యర్ ఉన్నతమైన ఆశయంతో సంఘాన్ని స్థాపించారని అన్నారు. సేవా కార్యక్రమాలతో పేద ప్రజలకు అండగా ఉండాలన్న లక్ష్యంతో సంఘం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సంఘ సభ్యులు ముందుకుసాగాలని తెలిపారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఏఈఎల్‌సీ కార్యదర్శి సి.హెచ్.కిషోర్ బాబు, ఉపాధ్యక్షుడు రెవరెండ్ ఎ.జేమ్స్, కోశాధికారి కె.మోజెస్ ఆర్నాల్డ్, పాస్టర్లు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన..

మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను అరికట్టి, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని బిషప్ పరదేశిబాబు కోరారు. మణిపూర్‌లో బాధిత క్రైస్తవులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరుతూ నార్త్ ప్యారిష్ చర్చిలో కొవ్వొత్తులతో సంఘీభావాన్ని తెలిపారు.

చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరుకు చెందిన ఇద్దరు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చేయూతనందించారు. పండల చక్రధర్, బాకా సుబ్బారావులు చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు సొంత బండి ఇప్పించాలని స్థానిక పార్టీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే ఆర్కేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే సోమవారం చిరు వ్యాపారులకు స్థానిక పార్టీ నాయకుల ద్వారా చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లను అందజేశారు.